నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | సెప్టెంబర్ 04, 2023 | www.navatelangana.com

## 6న సీనియర్ పురుషుల నెట్‌బాల్ ఎంపిక పోటీలు

**నవతెలంగాణ-గాంధారి**

గాంధారి మండలంలోని గండివేట్ లో సీనియర్ పురుషుల నెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు రఘురాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెట్ బాల్ సీనియర్ పురుషుల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ. శ్రీధర్, బి. రఘురాం తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకుని గాంధారి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గండివేట్ నందు ఉదయం 10గంటలకు హాజరు కాగలరని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు పీఈటీ రఘురాం (7097047036)ను సంప్రదించాలని సూచించారు.

## నేరాల నియంత్రణకు కృషి

### నూతన సీపీ సత్యనారాయణ

**నవతెలంగాణ-కంఠేశ్వర్**



మాట్లాడుతున్న సీపీ

మహిళల భద్రతే ప్రథమ లక్ష్యంగా పనిచేస్తామని, నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు కృషి చేస్తానని నూతన సీపీ సత్యనారాయణ అన్నారు. రాచకొండ నుంచి బదిలీపై వచ్చి నిజామాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పోలీసు శాఖలో పని చేసిన అనుభవంతో శాంతిభద్రతల పర్యవేక్షణకు పాటుపడుతామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని, మహిళలకు జరిగే వేదింపులను అరికడుతామన్నారు. ఇటీవల కాలంలో సైబర్ క్రైం కేసులు పెరిగిన నేపథ్యంలో దాని కట్టడికి కృషి చేస్తామన్నారు.

# ఇసుక మాఫియాకు బ్రేకులేవి..?

- అనుమతులు రద్దు చేసినా ట్రాక్టర్‌లతో యథేచ్ఛగా రవాణా
- సహకరిస్తున్న అధికారులు..?



ఆదివారం తెల్లవారు జామున ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లలో తరలిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-బిచ్కుంద**

బిచ్కుంద మండలంలోని ఖత్గాం, షట్లూర్, పుల్కల్, వాజీద్‌నగర్ మంజీర పరివాహక ప్రాంతం నుండి రాత్రి, పగలు అనే తేడా లేకుండా అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా ట్రాక్టర్ ద్వారా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ల యజమానులు గ్రామల శివారులలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక డంపులు వేసి రాత్రి సమయాల్లో లారీలు నింపి పక్క రాష్ట్రమైన కర్ణాటకతో పాటు హైదరాబాద్‌కు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు.

వర్షాకాలంలో వర్షాలు పడడంతో మంజీర పరివాహక ప్రాంతంలో ప్రభుత్వం ద్వారా అనుమతులు పొంది నడుస్తున్న ఇసుక క్వారీలు ప్రస్తుతం మూసి వేయడంతో కొందరు ఇసుక మాఫియదారులు అధికారులను మచ్చిక చేసుకుని అధికారులకు ముడుపులు అందజేస్తూ యదేచ్ఛగా ఇసుక రవాణాకు తెర లేపారు. ప్రతిరోజు 20 నుండి 50 టాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులే ఇసుక మాఫియా దారులకు అండగా నిలవడంతో తమను ఎవరు అడ్డుకుంటారనే ధీమాతో ఇసుక మాఫియా దారులు రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుక రవాణా చేస్తు లక్షల్లో డబ్బులు సంపాదిస్తున్నారు.

**గ్రామ శివారులో ఇసుక డంపులు లారీల ద్వారా రవాణా..**

మంజీకరా పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ఇసుక క్వారీలు ప్రస్తుతం మూసివేశారు. ఇసుకకు డిమాండ్ ఉండడం ఇసుక మాఫియాదారులకు కలిసొచ్చింది. అధికారులకు డబ్బులు ముట్ట చెప్పి మచ్చిగ చేసుకొని యదేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా పగలు ఇసుక రవాణా చేసి ఆయా గ్రామాల శివార్లలో డంపులు వేసి రాత్రి సమయాల్లో రోజుకు 20 వరకు లారీలు నింపి కర్ణాటకలోని బీదర్, హైదరాబాద్, నారాయణఖేడ్, జహీరాబాద్ తదితర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి ట్రాక్టర్లు, లారీల ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

**డబ్బులు ఇస్తేనే అనుమతులు లేకుంటే ట్రాక్టర్ల పై కేసులు**

ఖత్గాం, షట్లూర్, పుల్కల్, వాజీద్ నగర్, హజ్గుల్ గ్రామాల్లోని ట్రాక్టర్ యజమానులు అధికారులకు డబ్బులు ముట్టజెప్పి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. తనిఖీలు చేపట్టే సమయంలో అధికారులకు ముడుపులు ముట్ట చెప్పిన ట్రాక్టర్లను వదిలివేసి ముడుపులు ఇవ్వని యజమానుల ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేసి వారిపై ఒత్తిడి తీసుకువచ్చి ముడుపులు తీసుకున నామమాత్రపు పెనాల్టీ విదించి వదిలి వేస్తున్నట్టు భోగట్ట. రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు ట్రాక్టర్ యజమానులు రెవెన్యూ అధికారులకు కలవగానే వదిలివేసినట్లు సమాచారం. అధికారులకు డబ్బులు చెల్లిస్తేనే అనధికారిక అనుమతులు ఇస్తున్నారని అధికారులు కలవకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను మాటు వేసి పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. రోజు 20 నుంచి 50 వరకు ట్రాక్టర్లు రాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్న తనిఖీల పేరుతో వారానికి ఒకటి రెండు ట్రాక్టర్ల పై నామమాత్రపు కేసులు నమోదు చేసి విడిచిపెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా నిఘాతోపాటు చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరులుతున్న ఇసుక రవానాను అరికట్టాలని ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### అక్రమ రవాణా అరికట్టేందుకు టీం

**బాన్సువాడ ఆర్డీఓ భుజంగరావు**

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశాం. అందులో పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ట్రాక్టర్లు లారీల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం.

### రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న బిచ్కుంద ఎస్ఐ

మంజీర పరివాహక ప్రాంతం నుండి అనుమతులు లేకుండా ఖత్గాం గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా మండలంలోని ఫథలాపూర్ గ్రామ సమీపాన తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బిచ్కుంద ఎస్సై మురళి ఉదయం 5 గంటల సమయంలో రెండు ట్రాక్టర్లను పట్టుకొని బిచ్కుంద పోలీస్ స్టేషన్ కు తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు ఎస్ఐ తెలిపారు.



# పంటకు ప్రాణం..

- వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని ఆవేదన
- ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఖుషి



లింగంపేట్ పెద్దవాగుకు వరద ఉధృతి



సదాశివనగర్‌లో పొంగిపొర్లుతున్న చెక్‌డ్యాం

**నవతెలంగాణ-లింగంపేట్/సదాశివనగర్**

ఎట్టకేలకు వరునుడు కరుణించాడు. ఒక వైపు సాగుకు వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో అటు రైతులు ఆందోళన చెందుతుండగా.. మరో వైపు ఎండ వేడి ప్రభావంతో ఇటు ప్రజలు ఇక్కట్లు పడ్డారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లింగంపేట్ గ్రామ సమీపంలోని పెద్ద వాగు పొంగిపొర్లుతుంది. ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్ సీజన్లో రైతులు బోరు బావుల వద్ద చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో వరి నాట్లు వేశారు. అదేవిధంగా వర్షాధారమైనటువంటి మొక్కజొన్న సోయా పత్తి పెసర మినుము లాంటి పంటలు సాగు చేశారు. ఆగస్టు నెలలో వర్షాలు కురువకపోవడంతో వర్షాధార పంటలు ఎండు ముఖం పట్టాయి. ఎండలు తీవ్రం కావడంతో వాడిపోతున్నాయి. దీంతో రైతులు వర్షం కోసం నిరీక్షిస్తున్నారు. అంతేకాకుండా మెట్ట ప్రాంతాల్లో వరి పంట సాగు చేసిన రైతులు నీళ్ల అందకపోవడంతో వర్షాలు కురవకపోవడంతో వరి పంటలు నీళ్ల లేక వాడిపోతున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేస్తే ఆగస్టు నెలలో వర్షాలు కురువకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో అన్నదాతల్లో రైతుల్లో ఆనందం అంతులేకుండా పోయింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టిన పంటలను ఈ వర్షం ఆదుకుందని రైతులు తెలిపారు. ఎగువ ప్రాంతాలతో పాటు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షం కారణంగా లింగంపేట్ పెద్దవాగు ఆదివారం మధ్యాహ్నం నుండి పొంగిపొర్లుతుంది. పెద్ద వాగు పరిసర ప్రాంతాల్లోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పెద్ద వాగు, లింగంపల్లి గ్రామ సమీపంలోని పాములవాగు పొంగిపొర్లడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోయే పంటలకు వర్షం ప్రాణం పోసిందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**పొంగి పొర్లుతున్న వాగులు**

**సదాశివనగర్ :** మండలంలో ఉదయం నుండి కురుస్తున్న వర్షాలకు రైతులు ఆదివారం హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో వాగులు పొంగి పొర్లుతున్నాయి. వర్షాలు కురువక పంటల ఎండిపోవడంతో ఆందోళన చెందిన రైతులు.. ఆదివారం కురిసిన వర్షంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మాటల్లోనే రుణమాఫీ.. బ్యాంకులో జమకావట్లే

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

**నవతెలంగాణ-రెంజల్**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసినట్లు సర్పంచ్ తమ ఫోన్లో సమాచారం అందించినప్పటికీ, తీరా బ్యాంకుల్లో వారి బ్యాంకు ఖాతాలో రుణమాఫీ పడకపోవడం శోచనీయమని మాజీ మంత్రి పి సుదర్శన్ రెడ్డి అన్నారు. రెంజల్ మండలంలోని బాగేపల్లి, కునేపల్లి, కళ్యాపూర్, రెంజల్, సాటాపూర్, గ్రామాలలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆయా బ్యాంకులలో రుణమాఫీ మెసేజ్లు వచ్చినప్పటికీ, వారి ఖాతాలో డబ్బులు పడకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమే అని అన్నారు. తాను రెంజల్ తహసీల్దార్ తో ఫోన్లో మాట్లాడానని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించినట్టు తెలిపారు. గతంలో రుణాలు తీసుకున్న రైతుల ఖాతా నెంబర్లను తొలగించి వారికి కొత్త నెంబర్లు ఇవ్వడంతో ఈ సమస్య తలెత్తిందని ఆయన పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు ప్రస్తుతం రైతుల ఖాతా నెంబర్లతో తిరిగి సంబంధిత అధికారులకు తిరిగి తెలియపరచినట్లయితే వారి రుణమాఫీ అవుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సమగ్ర దర్యాప్తును చేపట్టి రైతులకు మాఫీ అయినా రుణాలను వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఐకెపి కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, డ్వాక్రా గ్రూపు మహిళలకు న్యాయం జరిగేలా డి ఆర్ డి ఏ పి డి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల కేంద్రమైన రెంజల్‌లో ఐకెపిలో ఇటీవల అనేక ఆరోపణలు ఎదుర్కొంటూ సరెండర్ అయినా ఏపిఎం, సి ఎ ల స్థానంలో వెంటనే మరొకరిని నియమించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబీన్ ఖాన్, ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, జిల్లా నాయకులు తాహెర్బిన్ అందంన్, రాజిరెడ్డి, స్థానిక నాయకులు జావీద్ ఉద్దీన్, కిసాన్ సెల్ జిల్లా నాయకులు సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో ఓటరు నమోదు

- అర్హులందరూ ఎన్‌రోల్ చేసుకోవాలి
- పలు పోలింగ్‌కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్ పరిశీలించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ





ఆర్మూర్, బాల్కొండలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

**నవతెలంగాణ-ఆర్మూర్/బాల్కొండ**

18 సంవత్సరాలు నిండిన యువత తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఆన్‌లైన్‌తో పాటు పోలింగ్ బూత్‌ల వారీగా ఆఫ్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. పట్టణంలోని బాలికల, జంబి హనుమాన్ టెంపుల్, బాలుర పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో స్వీకరిస్తున్న దరఖాస్తుల ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1.10.2023 నాటికి 18 సం. లు పూర్తియినా యువత తప్పకుండ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అలాగే డ్రాఫ్ట్ రోల్ నందు ఓటర్ల వివరాలు సరిగా చూసుకోవాలని ఏమైనా వివరాలు తప్పుగా ఉన్నచో సవరణ కోసం ఫారం నం. 8 ద్వారా నేరుగా సంబంధిత బి ఎల్ ఓ లకు అందివ్వాలని సూచించారు. లేకుంటే మొబైల్ యాప్ 'వోటర్‌హెల్ప్' ద్వారా అర్జీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్డీవో వినోద్ కుమార్, తహసిల్దార్ జి. శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు లు పాల్గొన్నారు.

**ఓటరు నమోదును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**బాల్కొండ :** బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామంలో పోలింగ్ స్టేషన్ 21 లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ బూత్ లెవెల్ అధికారులను పలు సూచనలు చేశారు. 18 ఏళ్ల నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్యవంతం చేయాలన్నారు.అలాగే, 17 ఏళ్ల నిండిన వారు కూడా ముందస్తుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో అర్హులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఫాం 6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫాం 6బీ, ఫాం 7, ఫాం 8 ద్వారా ఓటరు జాబితా వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు. కొత్త ఓటర్ల పేరు, వివరాలతో నమోదయ్యేలా చూడాలనీ అధికారులను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. బాల్కొండ తహశీల్దార్ ఏ. శ్రీధర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ వినోద్ కలెక్టర్ వెంట ఉన్నారు.

## క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పలువురు

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ 60వ జన్మదిన సందర్భంగా ఈ బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ సంయుక్తంగా సేవా భారతి ఇందూర్ జిల్లా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో గవర్నమెంట్ హాస్పిటల్ నిజామాబాద్ బ్లడ్ డొనేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కావ్య పర్యవేక్షణలో గవర్నమెంట్ హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్లు ప్రేమ్ చంద్, సందీప్, బాలు, సుమన్ మరియు భాగ్య శ్రీ లు బ్లడ్ డొనేషన్ క్యాంపులో సేవలు అందించారు. సేవా భారతి ప్రముఖ్ మంతెన ప్రదీప్ మాట్లాడుతూ క్షత్రియ కళాశాల వారు ప్రతి సంవత్సరం ఎన్నో రక్తదాన శిబిరాలను ఏర్పరిచి ఎల్లప్పుడూ రక్తదానం కోసం ముందు ఉంటారని అన్నారు. రక్తదానం చేయడంపై అపోహలు ఉన్నట్లయితే వాటిని నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్కే పాండే, ఎంబీఏ హెచ్ ఓ డి డాక్టర్ సుధాకర్, మెకానికల్ ఇంచార్జ్ హెచ్ ఓ డి డాక్టర్ వేద ప్రకాశ్ శివరాజ్, మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నరేష్ రాజ్, పాలిటెక్నిక్ ఈఈఈ హెచ్ ఓ ఎస్ మహేష్ లు ప్రతి సంవత్సరం వలే ముందుగా రక్తదానం చేసి విద్యార్థులకు స్ఫూర్తిని కలగజేశారు. ఈ కార్యక్రమానికి ఎన్ ఎస్ ఎస ప్రోగ్రాం ఆఫీసర్ శివరాజ్ విద్యార్థులు సహకారం అందించారు.

# అర్హులందరూ ఓటర్లుకావాలే

- ఓటరుగా నమోదు, మార్పుల, చేర్పులకు 19వ తేదీ వరకే అవకాశం
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- రెండురోజుల డ్రైవ్‌లో 4,510 దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడి

**నవతెలంగాణ-కామారెడ్డి**

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా బూత్ స్థాయి అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కామారెడ్డిలోని పలు పోలింగ్ బూతులను ఆకస్మికంగా సందర్శించి ప్రత్యేక శిబిరాల నిర్వహణ తీరుతెన్నులు పరిశీలించారు. శని, ఆదివారాల్లో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ లో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి 4, 510 ఫారాలు వచ్చాయని తెలిపారు. ఓటర్ల నమోదు, జాబితా నుండి పేర్ల తొలగింపు, మార్పులు-చేర్పుల కోసం పాటిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకుని, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్ళు నిండే ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ మహిళా ఓటర్ల నమోదులో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. డబుల్ ఓటర్ల పేర్లు రాకుండా జాగ్రత్తగా చూడాలని, మరణించిన వారి పేర్ల తొలగింపులో కుటుంబ సభ్యుల నుండి మరణ ధ్రువపత్రం పొందిన తరువాతే నోటీసు ఇచ్చి తొలగించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లకు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు గుర్తిస్తే, వారందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోకి చేర్చాలని కలెక్టర్ సూచించారు.

ఓటరు నమోదుతో పాటు అభ్యంతరాలు, ఆక్షేపణలు, మార్పులు, చేర్పులకు ఈ నెల 19 వరకు అవకాశం ఉందన్న విషయంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ నెల 19 వరకు వచ్చే ఫారం-6,7,8 లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్క రించాలన్నారు. అక్టోబర్ 4 న తప్పులు లేని, పారదర్శకమైన ఓటర్ల తుది జాబితా విడుదల చేసేందుకు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు.


కాగా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ కామారెడ్డి పట్టణంలోని 252,253 పోలింగ్ బూతులు సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అగ్గువయిన టమాట

- దిగొచ్చిన పచ్చిమిర్చి ధర
- పంట చేతికి రావడంతో తగ్గిన ధరలు
- సామాన్యులకు కొంత మేర ఉపశమనం



మార్కెట్‌లో పచ్చిమిర్చి విక్రయం



**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నెలన్నర రోజుల క్రితం టమాట పచ్చిమిర్చి ధరలు రోజురోజుకు పెరుగుతూ కిలోకు రూ.200 ధర పలికాయి. ప్రస్తుతం అమాంతం తగ్గి టమాట కిలో 15 నుండి 20 రూపాయలు వరకు పలుకుతుంది. పచ్చిమిర్చి సుమారు 20 రూపాయల నుండి 20 రూపాయలు వరకు పలుకుతుండటంతో సామాన్యులకు కొంత మేర ఊరటకలిగింది.

జిల్లాలో కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. నెలన్నర రోజుల క్రితం టమాట పచ్చిమిర్చి కిలో 200 రూపాయలు పలుకగా ప్రస్తుతం కిలో టమాట 20 రూపాయలు పచ్చిమిర్చి కిలోకు 25 రూపాయల చొప్పున పలుకుతోంది. టమాటా పచ్చిమిర్చి పంటలు చేతికి రావడంతో మార్కెట్‌కు పోటెత్తుతుండటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. వేసవిలో అకాల వర్షాలు ఆ తర్వాత జూన్ నెలలో వర్షాభావ పరిస్థితుల వల్ల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో జూన్ రెండో వారం నుంచి జిల్లాలో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. మొదట్లో టమాటా ధర పెరగగా తర్వాత మిగిలిన కూరగాయల ధరలపైనా ఆ ప్రభావం పడింది. జూన్ మూడో వారం నాటికి టమాట కిలో 100 రూపాయలు దాటింది. క్రమేపి టమాటా ధర కిలోకు 200 కు చేరుకుంది. ఆగస్టు రెండో వారం వరకు ధర అలాగే కొనసాగింది. తర్వాత నుంచి తగ్గుదల మొదలైంది. ప్రస్తుతం టమాటా పచ్చిమిర్చి కిలోకి 20 నుంచి 25 రూపాయలు పలుకుతోంది. రైతు బజార్లలో వంకాయ కిలో 19 రూపాయలకు, బెండకాయలు కిలో 23 రూపాయలకు, బీరకాయలు కిలో 18 రూపాయలకు, కాకరకాయ కిలోకు 23 రూపాయలు, దొండకాయ కిలోకు 18 రూపాయలు, బీన్స్ 35 రూపాయలు క్యాలీఫ్లవర్ కిలోకు 18 రూపాయలు ఉల్లిపాయ ఉల్లిపాయ కిలోకు 21 రూపాయలు క్యాబేజీ కిలోకి 13 రూపాయలు ఆలుగడ్డ కిలోకి 21 కీర కిలోకు 13 రూపాయల చొప్పున లభిస్తున్నాయి. అన్ని రకాల కూరగాయల పంటలు చేతికి రావడంతో మార్కెట్లకు కూరగాయలు భారీగా తరలివస్తున్నాయి. దీంతో కూరగాయల ధరలు అమాంతం తగ్గడంతో పేద మధ్యతరగతి ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | సెప్టెంబర్ 04.2023 | www.navatelangana.com

## వరికి ప్రాణం పోసిన వర్షం

- రైతన్నల హర్షం

నవతెలంగాణ-ధర్పల్లి

తుఫాను ప్రభావంతో కురిసిన వర్షంతో మండలంలోని రైతన్నల మొఖాల్లో సంతోషం నిపింది. వర్షాలు లేక, భూగర్భజాలు అంతంతా మాత్రాన ఉండటంతో వరికి బోర్లు నీరు అందకి ఎండిపోతుందన్న బెంగతో ఉన్న రైతన్నలకు శనివారం రాత్రి కురిసిన వర్షం ప్రాణం పోసింది. ఆదివారంసైతం ఓ మోస్తారుగా కురిసిన వర్షానికి రైతన్నలు మురిసిపోయారు. మరో 3,4 రోజులు వర్షం లేకపోతే వేసిన వరి ఎండిపోయేదని అన్నారు. ఈ వర్షం ద్వారా రైతులకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. ఈ వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి ఉన్న, వాటితో భూగర్భ జలాలు పూర్తిగా బోరు బావులకు అందుకోలేవని, అందుకే బోర్లు సరిగ్గా నీరు పోయడం లేదని తెలిపారు. మరో 15 రోజుల్లో పొట్టదశకు చేరనన్న వరి ఎండి పోతుందనే దిగాలుతో ఉన్న రైతన్నలకు ఈ వర్షం ఆదుకుంది.

## వ్యాయామశాల ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి



మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోల్డెన్ వ్యాయామశాలను ఆదివారం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యాయామశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులు పబ్బాశేఖర్ ను అభినందించారు. కార్యక్రమంలో బిజెపిరాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, నియోజకవర్గ నాయకులు, మలాద్రి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దళిత యువకున్ని హింసించిన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మంచిర్యాల జిల్లా మందమర్రిలో మేక పోయిందని అనుమానంతో దళిత యువకుడ్ని తలకిందులుగా వేలాడదీసి కింద పొగ పెట్టి ఊపిరాడకుండా చేసిన ముగ్గురు వ్యక్తులను కఠినంగా శిక్షించాలని దళిత ఐక్య సంఘటన డివిజన్ నాయకులు ఎం కోటేశ్వర్, జంగం అశోక్, గుమ్మడి చంద్రయ్య, పింజా పెద్ద భోజన్న, ఎల్ టి కుమారస్వామిలు ఆదివారం డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## చెరువులో పడి వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్పూర్ గ్రామం చెరువులో అదే గ్రామానికి చెందిన సుభద్ర(60) సంవత్సరాలు పడి మృతి చెందింది. ఎస్సై రామ్ కథనం ప్రకారం.. సుభద్ర ఒంటరి మహిళ. నాలుగురోజులక్రితం ఇల్లు వదిలి వెళ్లింది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు. నాలుగు రోజుల తర్వాత కులస్పూర్ చెరువులో మృతదేహం బయటకు వచ్చింది. వాళ్ళ అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూరు మండల కేంద్రానికి చెందిన వేల్పూర్ శ్రీనివాస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల ఐదున ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు తీసుకోనున్నారు ఈ సందర్భంగా విశ్వకర్మ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోపాల కృష్ణ ఆచార్య, మండల విద్యాధికారి రాజా గంగారం, టి టి యు జిల్లా అధ్యక్షులు పెంట జలంధర్, పిఆర్టీయూ నాయకులు ఇట్టెం గోపాల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## వంటమనిషి కావలెను

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో వంట చేయడానికి వంట మనిషి ఇంచార్జ్ జి సవిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖస్తు చేసుకొనే వారు 10 వ తరగతి పాసై ఉండాలని, ఈనెల 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 6305148916, 9182322310 నంబర్కు సంప్రదించాలని సూచించారు.

## మాల మహానాడు కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీసభ్యులు

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండల కేంద్రంలో మాల మహానాడు నూతన కార్యవర్గం ఆదివారం మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి, బోధన్ డివిజన్ అధ్యక్షులు మదాసు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బోధన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మాచ్కురి దేవేందర్ , డివిజన్ ఉపాధ్యక్షులు కారం స్వామి , వాగ్మారే సంజీవ్ తదితరులు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. మాల మహానాడు మండల అధ్యక్షులుగా సోన్ కాంబ్లే రాహుల్ (సొంపూర్), ప్రధాన కార్యదర్శిగా గైని వీరేశం (పోతంగల్) ఉపాధ్యక్షులుగా విద్యాసాగర్ (చేతనగర్) , కోశాధికారిగా సోన్ కాంబ్లే యాదవ్ (సుంకిని ), సంయుక్త కార్యదర్శిగా శ్రీ నీరడీ లక్ష్మణ్ (కొడిచర్ల) తదితరులను ఎన్నుకున్నారు.

## గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

- సూపర్‌వైజర్ రమాదేవి



మాట్లాడుతున్న సూపర్వైజర్

నవతెలంగాణ-భీంగల్

గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని అప్పుడే పుట్టబోయే పుట్టిన బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి తెలిపారు మండలంలోని బాబాపూర్ గ్రామంలో పోషక అభియాన్ లో భాగంగా బాలింతలు గర్భిణీలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పుట్టబోయే, పుట్టిన బిడ్డలు పోషకాహార లోపం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని కనుక బాలింతలు గర్భిణీలు ముందుగానే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం అంగన్వాడి సెంటర్ల ద్వారా ప్రతి గ్రామంలోని గర్భిణీ,బాలింతలకు పోషకాహారాన్ని అందజేస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆయేషా ఫిర్దోస్ మరియు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు అశోక్ మరియు పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పోచారంలో సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామంలో ఆదివారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం సభ్యత్వం ప్రారంభించినట్టు ఐఎఫ్‌టీయూ బోధన్ డివిజన్ నాయకులు కే రవి తెలిపారు. పంటకు మద్ద ధరలు, క్రాఫ్ లోన్లు, ఎరువులు, సబ్సిడీ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో కె రవి. వైద్యనాథ్. మన్సూర్ భగవాన్, దాస్, మిట్టాపూర్ ,పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం.. దుమ్ము, ధూళి

- అధ్వాన్నంగా మారిన సర్వీస్ రహదారులు
- శ్వాసకోస రోగాల బారిన పడుతున్న స్థానికులు
- ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టింపేది..?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లోగల సర్వీసు రోడ్డు పూర్తిగా దుమ్ము ధూళితో నిత్యం ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇలాగైతే ఆస్పత్రుల పాలు కాక తప్పదని ప్రజలు, చిరు వ్యాపారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేఏళ్ల క్రితం జాతీయ రహదారి44 సమయంలో గ్రామస్తులు ఇతరుల కోసం సర్వీస్ రోడ్డు ను ఇందల్ వాయి మండల కేంద్రంలో ఇరువైపులా నిర్మించారు.

రోడ్డు కు ఇరువైపులా దుమ్ము ధూళి తొలగించకుండా అలాగే వదిలి వేయడంతో సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న తమకు ఇబ్బందులు తప్పడంలేదని ప్రజలు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్ళుగా తము అనునిత్యం దుమ్ముతో సాహవాసం చేస్తూ తమ ఆరోగ్యాలను నాశనం చేసుకుంటూ ఆస్పత్రుల చుట్టూ తిరగవలసి వస్తుందని వ్యాపారులు ప్రజలు పేర్కొంటున్నారు.

### ఏళ్లుగా యాతనే..

మిషన్ భగీరత పుణ్యమా అని పెద్ద పెద్ద పైప్లైన్లు సర్వీస్ రహదారి మధ్యలో నుండి వేయడంతో కొన్నేళ్ల వరకు అటు వాహనదారులు ఇటు వ్యాపారస్తులు ద్విచక్ర వాహనాదరులకు రోడ్డు వేయకుండా అలాగే వదిలి వేయడంతో ఇబ్బందులు పడ్డారు.ఎట్టకేలకు సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా తారు రోడ్డు వేయడంతో ఇబ్బందులు తప్పాయని అందరు అనుకున్నారు. కానీ కొన్ని నెలలు గడిచాయో.. లేదో మళ్ళీ పాత కథే పునరావృతం అవుతూనే ఉంది. ఏడాదిలో వచ్చే నాలుగు సీజన్లు కూడా ఒక్క రోజు కూడా మినహాయింపు లేకుండా దుమ్ముధూళి, బ్రిడ్జ్ వద్ద వర్షపు నీరు చేరి పెద్ద పెద్ద గుంతలు పడి వాహనదారులు, ప్రజలకు అష్టకష్టాలు పడుతూనే ఉన్నారు. తమ బాధలు తిలకించే వారే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు వ్యాపారస్తులు వాహనదారులు టోల్ ప్లాజా అధికారులకు విన్నవించినా సమస్య నేటికీ అలాగే ఉంది. తూతూ మంత్రంగా ఎప్పుడో ఒకసారి కొందరు కార్మికులను పంపి కొన్ని చోట్ల ఒకరోజు మట్టుకు దుమ్ము ధూళి తొలగిస్తున్నారని అంటున్నారు. అత్వంగ్ టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కూతవేటు దూరంలో ఉన్న ఈ సర్వీస్ రోడ్లపై చెత్తాచెదారం, డ్రైనేజీ లో కురుకు పోయిన తొలగించే నాథుడే కరువయ్యారని, తాము చేసేది ఏమీ లేదని, సర్వీస్ రోడ్లను గ్రామ పంచాయతీ వారు చూసుకోవాలని టోల్ ప్లాజా అంటున్నారని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదరుల నుండి వసూళ్లు చేసేది టోల్ ప్లాజా వారైతే సర్వీస్ రోడ్లను పరిశుభ్రంగా ఉంచడానికి గ్రామ పంచాయతీ వారు చేయాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని గ్రామ పంచాయతీ అధికారులు అంటున్నారు. దుమ్ము ధూళి నుండి ప్రజలకు విముక్తి కల్పించాలని పలువురు పేర్కొంటున్నారు.



దుమ్ముతోనిండిన రోడ్డు



రోడ్డంతా నిండిన దుమ్ము

### టోల్ వసూళ్ల పైనే శ్రద్ధ.. సౌకర్యాలపై ఏది..?

జాతీయ రహదారి44 పై రాకపోకలు సాగించే వాహనదారుల వద్ద నుండి ముక్కు పిండి వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ రాహదరులపై ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్లపై ఎందుకు ఉండటం లేదని పలువురు పేర్కొంటున్నారు .బ్రిడ్జి కింది నుండి డిచ్ పల్లి, దర్పల్లి,ఇందల్ వాయి, సిరికోండ, భీమ్ గల్ తో పాటు ఎన్నో గ్రామాలు,మండలాల నుండి అనునిత్యం వందలాది, ద్విచక్ర వాహనలు, ఆర్టీసీ బస్సులు,లారీలు, ఆటోలు, కార్లు, ఇతరత్రా వాహనాల రాకపోకలను సాగుతుంటాయి, వీరికి వేరే మార్గం లేక దుమ్ము ధూళిఉన్న రాకపోకలు సాగించక తప్పని పరిస్థితులు దాపురించాయని వాహన దారులు ఆవేదన చెందుతున్నారు.

## మంత్రిపై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం

నవతెలంగాణ-ఏర్గట్ల



మాట్లాడుతున్న పూర్ణానందం

మంత్రి ప్రశాంత్ రెడ్డిపై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల ముఖ్య సమావేశం బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పూర్ణానందం మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న మంత్రి ప్రశాంత్ రెడ్డిపై గడప గడపకు ప్రచారం అంటూ ఓ నాయకుడు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడని తెలిపారు. అలాగే ప్రతిపక్షాలు కూడా పిచ్చికూతలు మానుకోవాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని, సీఎం కేసీఆర్,మంత్రి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు అభివృద్ధిని గమనించి బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బాలాజీ గౌడ్, క్యాతం సుభాష్, కుర్మ శేఖర్, వేశాల నర్సారెడ్డి, ముక్కెర దేవన్న, కూతురు సాయన్న, బోనగిరి రమేష్, సోమిరెడ్డి శ్రీనివాస్, ఓర్సు రాములు, నాగిరెడ్డి రాజేందర్, బద్రి కృష్ణ, మూడ్ గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

## 5న చలో కమిషనర్ కార్యాలయం జయప్రదం చేయండి

- తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

ఈనెల 5న భవన నిర్మాణ కార్మికుల చలో కమిషనర్ కార్యాలయంలో జయప్రదం చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్స్ట్రక్షన్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఏ ఆదివారం తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ యూనియన్ (సిఐటియు) నిజామాబాద్ నగర విస్తృత సమావేశం నాందేవ్ వాడ లోని సిఐటియు కార్యాలయంలో కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ తెలంగాణ కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి లేబర్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి మేడే 2023 వరకు బైకులు అందజేస్తామని ఇచ్చిన హామీ అమలు కోసం సెప్టెంబర్ 5న చలో రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, భవన నిర్మాణ కార్మికుల నిధులను అధికారులు దారి మళ్లిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు, కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం కార్డు రెన్యువల్ కోసం వేలిముద్రలు రాకపోవడంతో అనర్హులుగా ప్రకటిస్తూ నిజమైన కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. దానికి ప్రత్యమ్నయంగా కంటి స్కానింగ్ ద్వారా అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టంలో తీసుకువస్తున్న మార్పులకు వ్యతిరేకంగా భవన నిర్మాణ కార్మికుల ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మల్యాల గోవర్ధన్, కో కన్వీనర్ కటారి రాములు, నాయకులు నల్వాల నరసయ్య షేక్ ఇబ్రహీం, సునీత, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు

- కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



సోయాపంటను పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

ఎప్పుడు ఎన్నికలు ఓట్ల కోసం ఆలోచించే ఈ ప్రభుత్వం, మంత్రి ప్రశాంత్ రెడ్డి ఏనాడూ కనీసం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ కుమార్ విమర్శించారు. ఆదివారం మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో తెగుళ్లతో దెబ్బతిన్న సోయా పంటను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలో తెగుళ్ల వల్ల సోయా పంటకు అపారమైన నష్టం జరిగిందన్నారు.నియోజకవర్గంలో వేల ఎకరాలలో రైతులు సోయా పంట సాగు చేయడం జరిగిందని, సాగు చేసిన పంట పూర్తిగా తెగుళ్ళ సోకి దిగుబడి రాని పరిస్థితుల్లో ఉందన్నారు. గతంలో స్వయాన ముఖ్యమంత్రి నష్టపరిహారం ఇస్తామని ప్రకటించిన ఏ ఒక్క రైతుకు అందలేదన్నారు. వీరు మాట్లాడే మాటలన్నీ అబద్ధాలే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పంటలకు మద్దతు ధరలు, పంట నష్టపరిహారాలు అందుతాయని తెలిపారు. అభివృద్ధి ముసుగులో దోపిడి కొరకు ముఖ్యమంత్రి కాళ్ళు మొక్కే ప్రశాంత్ రెడ్డి, నియోజకవర్గంలో సోయా రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి కాళ్ళు మొక్కాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా కిసాన్ ఖేత్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, మనోహర్, బద్దం రవి, తెడ్డు రమేష్, శ్రీధర్, రేవతి గంగాధర్, తెడ్డు రవి, పాలేపు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను సన్మానించిన కౌన్సిలర్లు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రవీణ్ గౌడ్, కోకిల నాగరాజును ఆదివారం స్థానిక కౌన్సిలర్లతో పాటు మిత్ర బృందం సన్మానించారు. ...ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేడిదాల సంగీత రవి గౌడ్, కోన పత్రి కవిత కాశీరాం, ఆకుల రాము, వీడీసీ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఎడపల్లి నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి



ఎమ్మెల్యేకు బొకేను అందజేస్తున్న నాయకులు

బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ షకిల్ ఆమేర్‌ను ఆదివారం ఎడపల్లి మండల టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే ఎండి షకిల్ అనే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకెను అందించారు. బోధన్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. మూడోసారి ఎండి షకిల్ అమేర్‌ను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపిస్తామని నాయకులు స్పష్టం చేశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో ఎడపల్లి మండల సీనియర్ నాయకులు కలిశారు. బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ అర్చన సూర్యకాంత్ వాగ్మారే, టిఆర్ఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు అబ్దుల్ వాహెబారిలు షకీల్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## ఓటర్ నమోదు చేయించిన నాయకులు



ఓటరు నమోదు చేయిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ఆదివారం స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా పలువురు యువకులను ఓటర్లుగా నమోదు చేయించారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ పెండే ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యురాలు బుస్సాపురం సుప్రియ నవీన్ యాదవ్ ఓటర్ నమోదు చేయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన వారందరిని గ్రామ, బూత్ స్థాయి అధికారి వద్ద ఓటరుగా నమోదు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెండే ప్రభాకర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొంది వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం | సెప్టెంబర్ 04, 2023 | www.navatelangana.com

## వ్యక్తి అదృశ్యం



**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

పెద్దకొడప్‌గల్ మండలం పెద్ద దేవి సింగ్ తండాకు చెందిన భామన్ దేవిలాల్ (37) అదృశ్యమైనట్లు ఏఎస్ఐ రాములు తెలిపారు. గురువారం (ఆగస్టు 31వ తేదీ) మధ్యాహ్నం రెండు గంటలకు ఆసుపత్రికి వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. కొన్ని నెలలుగా మద్యానికి బానిస అయ్యాడని తండ్రి రాములు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు, వ్యక్తి కనిపిస్తే పెద్దకొడప్ గల్ పోలీస్ లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఓటర్ నమోదుపై అవగాహన కల్పించాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్**

**నవతెలంగాణ-భిక్కనూర్**

18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బిఎల్ఓ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, తప్పుల సవరణ వివరాలు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకునె విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమాజంలో ఓటు విలువ ఎంతో విలువైందని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట తాసిల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో అనంతరావు, మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సదాశివ్, తదితరులు ఉన్నారు.

### ప్రారంభించినా.. మూసివేతే

# ఆహ్లాదం పంచని మినీ ట్యాంక్‌బండ్

- **ఖిల్లా చెరువు వద్దకు వెళ్లి నిరాశతో తిరిగి వస్తున్న ప్రజలు**

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నగర ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు, కుటుంబీకులతో ఉల్లాసంగా సేదదీరేందుకు నగరంలోని ఖిల్లా చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చారు. ఇందుకోసం సుమారు 20 కోట్ల రూపాయల మేర వెచ్చించారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చి అట్టహాసంగా ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రారంభోత్సవం చేసుకున్నా.. ఇంకా నగర వాసులకు ఆహ్లాదం పంచడం లేదు. గేటుకు ఎల్లప్పుడూ తాళం దర్శనమిస్తుండటంతో అక్కడి వరకు వెళ్లిన ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. నిజామాబాద్ నగరానికి తలమాణికంగా ఉండే విధంగా ప్రభుత్వం ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు నిర్మించిన మినీ ట్యాంక్‌బండ్‌ను ఆగస్టు 9న ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ ఆర్ ప్రారంభించినప్పటికీ, నగర ప్రజలకు నేటికీ అందుబా టులోకి రాకపో వడంతో నగరప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సినిమాకు కుటుంబంతో కలిసి వేళ్తే వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయని, అటువంటిది ప్రశాంత వాతావరణంతో పాటు ఖర్చు లేకుండా ప్రశాంత పొందే విధంగా ట్యాంక్ బండ్ నిర్మించినట్టు పాలకులు ఊదరగొడుతున్నా.. ఇప్పటికి అందుబాటులో రాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మినీ ట్యాంకు అందుబాటులోకి వస్తదని ఆరేండ్లుగా ఊరిస్తూనే ఉన్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. 20 కోట్లు వెచ్చించి ప్రారంభోత్సవం చేపట్టుకునాన.. ఇంకా ఇప్పటికీ ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర వాసులు కోరుతున్నారు.




మూసివేసిన ఉన్న ట్యాంక్‌బండ్

## ఆర్మీలో ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న ముదిరాజ్‌సేవాసమితి సభ్యులు

**నవతెలంగాణ-దోమకొండ**

దోమకొండ మండలంలోని సీతారాంపూర్ గ్రామనికి చెందిన మడతల శ్రవణ్ కుమార్ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఆర్మీ రిక్రూట్మెంట్‌లో ఎంపిపడంతో దోమకొండ ముదిరాజ్ సేవా సమితి, అధ్యక్షులు పున్న లక్ష్మన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారమిక్కడ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులానికి చెందిన యువకుడు కష్ట పడి ఆర్మీ లో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందని, యూవత ఆయనను ఆదర్శం గా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ సేవా సమితి సభ్యులు,బోయిని సత్యం, పున్న రాములు, కడారి రమేష్, నాగారపు ఎల్లయ్య, వెంకటి, అబ్రబోయిన రాజేందర్, లింగం ,సత్యం ,శంకర్, శ్రీను ఎల్లయ్య,నర్సింలు,అంజయ్య, గాలయ్య ,లక్ష్మణ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విప్ కుమారుడి వివాహ వేడుక

- **హాజరై దంపతులను ఆశీర్వదించిన సీఎం కేసీఆర్**



వివాహానికి హాజరైన సీఎం కేసీఆర్

**నవతెలంగాణ-భిక్కనూర్**

హైదరాబాద్ పట్టణంలో జాన్వి కన్వెన్షన్ సెంటర్‌లో విప్ గంప గోవర్ధన్ తనయుడు శశాంక్-సుప్రియ వివాహం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివాహ వేడుకల్లో సీఎం కేసీఆర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. సీఎం కేసీఆర్‌తో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, మంత్రి ప్రశాంత్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రితో కేసీఆర్‌తో జాజాల**

**నవతెలంగాణ-లింగంపేట్/సదాశివనగర్**

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తో ఆదివారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్ ముఖ్యమంత్రిని కలిసి వివా వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ విప్ కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కుమారుడు గంప శశాంక్ వివాహ వేడుకలు హైదరాబాదులో జరిగాయి. ఈ వివాహ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ తోపాటు ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ ముఖ్యమంత్రి పక్కనే ఉండి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తి.. శెట్పల్లి గ్రామం

- **డాక్టరేట్ పట్టా పొందిన ముగ్గురు యువకులకు సన్మానం**
- **రక్త దానం శిబిరం ఏర్పాటు.. 30 యూనిట్ల రక్తదానం**

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండలంలోని శెట్పల్లి గ్రామంలో ఇండియన్ సొసైటీ రక్తదాన శిబిరాన్ని ఆదివారం గ్రామ సర్పంచ్ పద్మ గంగారెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అట్టెం శ్రీను గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 30 యూనిట్ల రక్తదానం చేసినట్లు ఐఆర్ సిఎస్ మండల అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ శెట్టిపల్లి గ్రామం చిన్నదైనప్పటికీ తమ గ్రామంలో 35 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని ఈ మధ్యకాలంలో ముగ్గురికి అట్టెం దత్తయ్య, పిల్లి సురేష్, బందరు బోయిన శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా పొందారని తెలిపారు. వారికి రెడ్ క్రాస్ సొసైటీ తరఫున ఘనంగా సన్మానించినట్టు తెలిపారు. అదేవిధంగా మొదటిసారి రక్తదానం చేసిన 15 మంది యువకులకు స్థానిక ఎస్సై ప్రభాకర్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపేట్ మండలానికి శెప్పల్లి గ్రామంలో అధికశాతం యువకులు ఉన్నత విద్యావంతులుగా ఉన్నారని వారు మన మండల యువకులకు స్ఫూర్తిదాయకంగా ఉంటారని అన్నారు. గ్రామాలలో రక్తదానం చేయడంపై ఉన్న అపోహలను తొలగిస్తూ మేము సైతం రక్తదాతలం అవుతామంటు ముందుకు వచ్చిన గ్రామ యువకులను రెడ్ క్రాస్ సొసైటీ వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ పిల్లి అశోక్ అయ్యపల్లి సర్పంచ్ శంకరప్ప, వార్డు మెంబర్లు అప్పా సాయిలు, లక్ష్మా గౌడ్, తాజుద్దీన్ తిరుపతి, కృష్ణమూర్తి, మహేందర్, కిషన, మహేష్‌లతో పాటు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది డాక్టర్ శివాదాస్, పిఆర్ఓ ఆనంద్, ఎల్ టి శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ వెన్నెల పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగం పేట్ మండలంలోని కొర్పుల్ గ్రామానికి చెందిన బ్యాగరి కాశీరాం ఎద్దు విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం రాత్రి ఈదురు గాలులు వలన పెద్ద వాగు సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. మేతకు వెళ్లిన ఎద్దు తిరిగి రాకపోవడంతో ఆదివారం ఉదయం వెళ్లి చూడగా పెద్దవాగు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ వైర్ తగిలి మృతి చెంది ఉంది. సుమారు లక్ష రూపాయల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో బాధితుడు రోధిస్తూ గ్రామస్తులకు విద్యుత్ అధికారులకు అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ వైర్లు తెగిపోవడం వల్లే కరెంట్ షాక్ రావడంతో ఎద్దు మృతి చెందిందని ఆయన వాపోయాడు. నష్టపరిహారం చెల్లించాలని ఆయన అధికారులను కోరారు



మృతిచెందిన ఎద్దు

# లోక అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- **లింగంపేట ఎస్సై ప్రభాకర్**

**నవతెలంగాణ-లింగంపేట్**

గ్రామీణ ప్రాంత ప్రజలు దీర్ఘకాలికంగా కోర్టు పరిధిలో ఉన్నటువంటి కేసులు చిన్నచిన్న గొడవలు లోక్ అదాలత్ సమస్యలు పరిష్కరించుకోవాలని లింగంపేట ఎస్సై ప్రభాకర్ సూచించారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గొడవలు వద్దు-రాజీలు ముద్దు అని, వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవిత కాలం కొనసాగుతాయని తెలిపారు. ఒక వేల ఇంతటితో కలిసుంటాము అని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే సమసిపోతాయని ఆయన సూచించారు. ఈ నెల 9వ తేదీనా వరకు ఎల్లారెడ్డి కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున మీ పై కానీ, మీకు తెలిసిన వాళ్ల పై గాని ఏమైనా కేసులు ఉంటే వాటిని కాంప్రమైజ్ చేసుకొని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసును పూర్తిగా క్లోజ్ చేయనున్నట్టుతెలిపారు. యాక్సిడెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులకు సంబంధించిన కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగ తనం కేసులు, ఇతర రాజీ పడే కేసులు మొదలైనవి నేషనల్ లోకదాలత్‌లో కాంప్రమైజ్ చేసుకుని క్లోజ్ చేసుకోవచ్చని తెలిపారు. కాబట్టి ఈ అవకాశాన్ని కేసు ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనికోసం కేసు నడుస్తున్న ఫిర్యాదు దారుడు, నిందితుడు అందరూ తమ ఆధార్ కార్డు తీసుకుని రావాలని సూచించారు.

**లోక్ అదాలత్ లో పాత కేసులు పరిష్కారం**

**భిక్కనూర్:** లోక్ అదాలత్ లో పాత కేసులను పరిష్కారం చేసుకోవాలని భిక్నూర్ ఎస్సై సాయి కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా పోలీస్ కేసుల నుండి విముక్తి పొందడానికి ఈనెల 9 వరకు జిల్లా కేంద్రంలోని కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



భిక్కనూర్: మాట్లాడుతున్న ఎస్ఐ

## దేశ ఉద్యమంలో ముందుండి నడిపిన వ్యక్తి రామచంద్రన్



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

భారతదేశ ఉద్యమంలో ముందుండి నడిపిన వ్యక్తి రామచంద్రన్ అని సిపిఐ ఎంఎల్ ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్ అన్నారు. పట్టణంలోమెడికల్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ లో రైతు కూలీ సంఘజిల్లా నాయకులు బొట్ల గంగారం అధ్యక్షతన రామచంద్రన్ 15వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో విప్లవ సంస్థలన్నీ ఐక్యం చేయడం కోసం ముందుకు సాగాడని అన్నారు. ఆ తరుణంలోనే కొన్ని విప్లవ సంస్థల్ని ఐక్యం చేసి సిపిఐ ఎంఎల్ జనశక్తి కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారని అన్నారు. ఆయన కషితో కొన్ని విప్లవ సంస్థలు విలీనమై 18 రాష్ట్రాలకు విస్తరింపజేశారని తెలిపారు. క్యాన్సర్ వారితో బాధపడుతూ తుది శ్వాస వరకు ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ముందుండి పోరాడాలని, ఆయన కన్న కలల్ని నిజం చేయాలని సుధాకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిట్టిబాబు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కార్యదర్శి మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



బోనాలతో వస్తున్న మహిళలు

**నవతెలంగాణ-పిట్లం**

మండల కేంద్రంలో బారేడు పోచమ్మ బోనాల పండుగను ఆదివారం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత గ్రామపంచాయతీ హనుమాన్ మందిర్ నుండి బారేడు పోచమ్మ ఆలయం వరకు భాజాభజంత్రీలతో బోనాలను ఊరేగించారు. బోనాలు ఎత్తుకొని పలువురు చేసిన నృత్యాలు, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. శివసత్తులు నిర్వహించిన పోతురాజు విన్యాసాలు ప్రజలను ఆకర్షించాయి. ఆలయ గుడి ఆవరణలో పెద్ద ఎత్తున జాతర నిర్వహించడం వల్ల చిన్నారులు , మహిళలు ఆనందోత్సవం తో గడిపారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , ప్రజా ప్రతినిధులు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఆటో బోల్తా

**నవతెలంగాణ-తాడ్వాయి**

ప్రమాదవశాత్తు ఆటోబోల్తా పడిన ఘటన తాడ్వాయి మండలం దేమే గ్రామం శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగోజీవాడి గ్రామానికి చెందిన గైని ఎల్లయ్య కొడుకు వివాహం ఆదివారం సంగోజీవాడి గ్రామంలో ఉన్నందున శనివారం సాయంత్రం సంగోజి వాడి గ్రామానికి చెందిన బంధువులతో కలిసి కంకల్ గ్రామంలో పెళ్లి కూతుర్ని తీసుకురావడానికి వెళ్లి తిరిగి కంకల్ నుండి సంగోజీవాడి గ్రామానికి వస్తుండగా దేమే గ్రామం దాటిన తర్వాత రాత్రి అందజా 08.00 గంటల సమయం లో ఈదుల వాగు సమీపంలోకి రాగానే ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఆటో పల్టీలు కొట్టి రోడ్డుపైన పడడంతో ఆటోల ప్రయాణిస్తున్న సంగోజీవాడి గ్రామస్తులు హరికృష్ణ, సత్తెమ్మ, రేఖ, రామవ్వ, శోభకు గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న తాడ్వాయి పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి కొందరిని పోలీస్ వాహనంలో, కొంతమంది ని వేర్వేరు వాహనాలలో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న గైని సుగుణవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.



గాయపడ్డ మహిళలు

## రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- **మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి**

**నవతెలంగాణ-ధర్పల్లి**

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని గోవింద్ పల్లి గ్రామములో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అయన గ్రామస్థులతో మాట్లాడుతూ.. భవిషత్తులో కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. వంట గ్యాస్ కేవలం 5 వందలకే అందించనున్నామని అన్నారు. అలాగే రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటు, రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరుగుతుందని అన్నారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆదుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామంలోని ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, డీసీసీ అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, నరేష్ గంగారాం, బుచ్చన్న, సాయిలు, సుభాష్ రెడ్డి, శ్రీను, మగ్గిడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా వేస్తున్న అరికెల

## టీడీపీ మండల అధ్యక్షుడిగా మ్యాతరి సంజీవులు



నియామక పత్రం అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి

**నవతెలంగాణ-గాంధారి**

తెలుగుదేశం పార్టీ గాంధారి మండల అధ్యక్షుడిగా మ్యాతరి సంజీవులును నియమించారు. పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జీ మొడెగామ మహేష్.. ఆదివారం సంజీవులుకు నియామక పత్రం అందజేశారు. అదే విధంగా ఉపాధ్యక్షుడుగా సుధాకర్‌ను నియమించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంజీవులు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని అన్నారు.

# త్వరలో రుణ గ్రహీతలందరికీ రుణాలు

- **చైర్మన్ నారాయణ రెడ్డి**

**నవతెలంగాణ-పిట్లం**

సింగిల్ విండో పరిధిలోని రుణ గ్రహీతులందరికీ త్వరలో రుణాలు అందజేస్తామని విండో చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలం లోని చిన్న కొడప్ గల్ సింగిల్ విండో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ పరిధిలోని ఆయా గ్రామాల నూతన రైతులకు రుణాలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీలో భాగంగా మాఫీ అయినా సభ్యులకు తిరిగి రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. రుణాలు లబ్ధి పొందాక మిగిలి ఉన్న రైతులు ఎవ రైనా ఉన్నట్లయితే విండో సిబ్బం దిని సంప్ర దించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సాయ గౌడ్, డైరెక్టర్లు నాగిరెడ్డి, అనసూయ, లలిత , కుమ్మరి సాయిలు, వెంకటేశ్వరరావు, పెంటయ్య, గంగా గౌడ్, బన్న, ఎల్లారం సాయిలు, ఒర్రె విట్టల్, కాంత రెడ్డి, సంఘ సీఈవో హన్మండ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ నారాయణరెడ్డి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
సోమవారం | సెప్టెంబర్ 04, 2023 | www.navatelangana.com

## చెరువులో పడి వ్యక్తి గల్లంతు


హుస్సేన్‌కోసం గాలింపు చర్యలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన కటికే హుస్సేన్ అనే వ్యక్తి దాదాపుగా (55) శనివారం రాత్రి నుంచి కనబడుటలేదు. చుట్టుపక్కల వెతికిన ఎక్కడ కనిపించలేదు ఉదయం చెరువుకు సమీపంలో చెప్పులు, సెల్ఫోన్ లభ్యం కావడం వల్ల చెరువులోనే పడినట్టు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఎస్ఐ ఎల్ రామ్ గజ ఈతగాళ్లతో వెతికించారు. మృతదేహం లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు.

## పిప్రి గ్రామంలో గొడుగుల పంపిణీ



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పి ప్రీ గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆదేశానుసారం గ్రామ ప్రజలకు గొడుగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి, ఎంపీటీసీ సామెర సురేష్ తదితరులు పాల్గొన్నారు..

## పోషణ వనం...వడ్డేపల్లి అంగన్వాడి కేంద్రం

- టమాటా, ఉసిరి, జామ, పూల మొక్కల పెంపకం


పోషణ వనంలోని పూలమొక్కలు


కాసిన ఉసిరికాయలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వడ్డేపల్లి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా చేశారు. కేంద్రాల్లో పోషణ వనం తప్పకుండా ఏర్పాటు చేయాలని ప్రభుత్వంతోపాటు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్న విషయం అంగన్వాడి ఉపాధ్యాయులకు తెలిసిందే. ఇందులో భాగంగా వడ్డేపల్లి 108 అంగన్వాడి కేంద్ర ఆవరణంలో అంగన్వాడి టీచర్ దేవకుమారి, ఆయా రాజీ నిత్యం పనిచేస్తూ పచ్చని చెట్లను కాపాడుతున్నారు. జామ, నిమ్మ, ఉసిరి కాయల చెట్లు పెరిగి పెద్దవిగా మారాయి. వాటికి పండ్లు కూడా అయ్యాయి. చిక్కుడు, టమాట, వంకాయ కూరగాయల మొక్కలను నాటారు. సేంద్రియ ఎరువులతో ఈ పంటలను పండిస్తున్నారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణులు చిన్నారులకు ఎరువులువాడని ఆహారం అందించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు. పండ్ల మొక్కలు, ఆకుకూరలు, కూరగాయలు పెంచుతున్నారు.

### బాల బాలికలు ఆరోగ్యవంతంగా ఉండడమే లక్ష్యం

అంగన్వాడి ఉపాధ్యాయురాలు దేవ కుమారి



అంగన్వాడి కేంద్రాలకు వచ్చి చిన్నారి బాలబాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే తమ లక్ష్యం. అలాగే గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. అవసరమైన సమయంలో చిన్నారి బాల బాలికలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నాం. గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది. గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు సహకారం అందిస్తున్నారు.

## రిలే దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొనాలి

నవతెలంగాణ-బోధన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఈనెల 4 నుండి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో నిర్వహించే రిలే నిరాహార దీక్షల్లో పాల్గొనాలని సమగ్ర శిక్ష జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. జిల్లాలోని సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న కేజీబీవీ, పిటిఐ, సిఆర్పి, ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, ఐఈఆర్టి సిబ్బంది, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రిలే దీక్షలో పాల్గొనాలని కోరారు. ఈ రిలే దీక్షలు సమస్యలు సాధించేవరకు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

## హై మాస్ లైట్లు ప్రారంభించిన జడ్పిటిసి


హైమాస్ లైట్లను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-బోధన్

మండలంలో జిల్లా పరిషత్ నిధుల ద్వారా 20 గ్రామాలకు మంజూరయిన హైమాస్ లైట్లను శనివారం రాత్రి జడ్పీటీసీ లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ జడ్పీ నిధుల నుంచి మంజూరయిన 25 లక్షల రూపాయలతో హైమాస్ లైట్లను ఆయా గ్రామాల సెంటర్లలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన 18గ్రామాలలో ఈనెలలో హైమాస్ లైట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, ఏఎంసీ వైస్ చైర్మెన్ షకీల్, సర్పంచ్ పుష్ప, , డీసీసీబీ డైరెక్టర్ గిర్ధవర్ గంగారెడ్డి, నాయకులు బుద్దె రాజేశ్వర్, నర్సారెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూల్చిన గోడ... నిర్మాణం ఎప్పుడు?


గోడకూల్చిన ప్రదేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజా ప్రతినిధుల పని ఈ విధంగా ఉంటుంది అనడానికి ఒక చిన్న నిదర్శనం నిజామాబాద్ నగరంలో ఆగస్టు 9న ఐటీ మంత్రివర్యులు రాగా పాలిటెక్నిక్ కళాశాలలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఆ భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథుల వాహనాలు రావడానికి ప్రత్యేకంగా ఒక దారిని ఏర్పాటు చేశారు. ఆ దారికోసం చేయడానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఉన్న ప్రహరి గోడను కూల్చివేశారు. అవసరం నిమిత్తం ఓ పది నిమిషాలలో కూల్చివేసిన ప్రహరీ గోడను సుమారు 20 రోజులు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు నిర్మించకపోవడం చాలా విడ్డూరంగా ఉందని కళాశాల విద్యార్థులు, నగర ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కళే జీవనోపాధి

- గణపతి, దుర్గామాత విగ్రహాల తయారీ
- పలువురితో ప్రశంసలు



నవతెలంగాణ-బాల్కొండ

తన కళా నైపుణ్యంతో నాలుగు దశాబ్దాలుగా కళనే జీవన ఉపాధిగా మలుచుకుని కళాకారుడిగా జీవనం సాగిస్తూ ఎందరో ప్రముఖుల మన్నలు పొందాడు ఓ కళాకారుడు....ఆయనే సుంకం దామోదర్. 1961 సంవత్సరంలో కుస్తాపురం గ్రామంలో జన్మించారు. చిన్నయ్య, లక్ష్మీబాయి దంపతుల ద్వితీయ కుమారుడు దామోదర్. కుస్తాపురం గ్రామము శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపుకు గురి కావడంతో బాల్కొండ మండల కేంద్రంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన దామోదర్ జీవనోపాధి కోసం 1982 నుంచి చిత్రకారుడిగా పలు గ్రామాల్లో చిత్రాలు గీస్తూ జీవనం ప్రారంభించారు. తన ఊహకు అందిన శైలిలో ప్రకృతి సౌందర్యమైన చిత్రాలు అపురూపంగా గీస్తూ కళా సౌందర్యంతో ప్రజలలో మంచి చిత్రకారునిగా పేరు సంపాదించారు. అనంతరం 1989లో సిమెంట్ ద్వారా విగ్రహాలు తయారు చేయడం మొదలు పెట్టారు. తద్వారా దేవస్థానాలకు దేవతల విగ్రహాలను, ప్రవేశ ద్వారాలను, అలాగే స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ నాయకుల విగ్రహాలను తయారు చేసేవారు. దామోదర్ మంచి కళాకరుడిగా పేరు ప్రఖ్యాతలు సాధించడంతో ప్రముఖ దేవస్థానాలు అయిన బాసర, వేములవాడ దేవాలయాలకు సైతం విగ్రహాలను తయారు చేసి ఇచ్చారు. అనంతరం 2003 లో పిఒపి ద్వారా నాయకుడు విగ్రహాలను తయారు చేయడం మొదలుపెట్టారు. అయితే వాటితో నీటి కాలుష్యము అవుతుందని తెలియడంతో మట్టితో వినాయకుడు, దుర్గామాత విగ్రహాలను తయారు చేయడం ప్రారంభించారు. ఆయన తయారు చేసిన మట్టి విగ్రహాలను ప్రతి సంవత్సరం ఇతర జిల్లాల నుంచి వచ్చి భారీ మొత్తంలో కొనుగోలు చేస్తారు. ఈ విగ్రహాలు ఒక అడుగు మొదలుకొని పది అడుగుల ఎత్తు వరకు తయారు చేయడం విశేషం. తన కళా నైపుణ్యం తెలిసి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రస్తుత మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వారి ద్వారా మన్నలు పొందారు. దామోదర్ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలోనూ పాల్గొనడం విశేషం. దామోదర్‌కు ఇద్దరు కుమారులు రూపేష్, దినేష్ వీరు కూడా చిత్రాలు, విగ్రహాల తయారీలో ఆసక్తి చూపుతూ పలువురి మన్నలు పొందుతున్నారు.



మందిరముఖద్వారంపై తయారుచేసిన దేవతా ప్రతిమ


గణపతి ప్రతిమను తయారుచేస్తున్న దామోదర్

## జాతీయ మహాసభలను జయప్రదం చేయండి : ఏఐఎస్ఎఫ్

- కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. 30వ జాతీయ మహాసభలు ఈనెల 28 నుండి అక్టోబర్ 1 వరకు బీహార్ రాష్ట్రంలోని బెగుసరాయ్ పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి విద్యాను ప్రైవేటీకరణ, కార్పొరేట్కరణ, కాషాయీకరణ చేయడానికి కుట్ర చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు స్ఫూర్తి అయిన పూలే భగత్ సింగ్, అంబేద్కర్, నారాయణ గురు వంటి వారి జీవిత చరిత్రలను, డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించి బ్రిటిష్ వారి తొత్తుగా వ్యవహరించిన సావర్కర్ జీవిత చరిత్రలను చేర్చి దేశ చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. బాల్యం నుంచే విద్యార్థుల మెదడులోకి మతతత్వ భావాలను నింపుతున్నారని వాపోయారు. జ్యోతిష్యం, వాస్తు కోర్సుల పేరుతో విద్యార్థులలో మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారని అన్నారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని మెడికల్ ఎంట్రెన్స్ (నీట్) ను ప్రాంతీయ భాషలలో నిర్వహించకపోవడం వల్ల దక్షిణాది ప్రతిభవున్నా విద్యార్థుల సైతం నీట్ లో అర్హత సాధించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్ట ప్రకారం తెలంగాణ కేటాయించాల్సిన విద్యాసంస్థలను కేటాయించకుండా మోడీ ప్రభుత్వం రాష్ట్ర విద్యార్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని తెలిపారు. జిల్లాకు ఒక నవోదయ పాఠశాల, కేంద్రీయ విశ్వవిద్యాలయం, త్రిబుల్ ఐటీ ,ఐఐఎం, గిరిజన యూనివర్సిటీ లాంటి అనేక విద్యాసంస్థలను తెలంగాణలో నెలకొల్పకుండా విదార్థి లోకానికి తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం 2014 ఎన్నికల్లో హామీ అయిన కేజీ నుండి పీజీ ఉచిత నిర్బంధ విద్య హామీ నెరవేర్చలేదని తెలిపారు. పాఠశాల, కళాశాలలు, యూనివర్సిటీలు, సంక్షేమ హాస్టల్స్‌లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, 2018 ఎన్నికల హామీ అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం హామీ ఇప్పటికీ అమలు కాలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా విస్తరిస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటూ విద్యను వ్యాపారంగా మార్చారని అన్నారు. ఫీజులు నియంత్రణ చట్టం అమలు కావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల కబంధహస్తాల్లో ఉంటూ వారు చేస్తున్న ఫీజులు దోపిడీని చూసి చూడనట్టుగా వ్యవరిస్తుందని అన్నారు. ఈ మహాసభలో విదేశీ ప్రతినిధులతో పాటు దేశంలోని 29 రాష్ట్రాల నుండి వెయ్యిమంది విద్యార్థి ప్రతినిధులు పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, నాయకులు వంశీ ,రాజు పాల్గొన్నారు.

## మైనార్టీ మండల అధ్యక్షులుగా మూస


నియామక పత్రం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

మండల మైనార్టీ అధ్యక్షులుగా మహమ్మద్ మూసకు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మూడోసారి కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన మూసకు పలువురు అభినందనలు తెలిపారు. మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ రావు, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## హూన్సాలో 'మేరీ మిట్టి మేరీ దేశ్'

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హూన్స గ్రామంలో ఆదివారం మేరీ మిట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సోమేశ్వర ఆలయం వద్ద బీజేపీ నాయకులు మట్టిని సేకరించారు. కార్యక్రమంలో బి.జె.పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ , సాలూర మండల అధ్యక్షులు ప్రవీణ్, సీనియర్ నాయకులు అశోక్ గౌడ్ , బిజెపి మండల ప్రదాన కార్యదర్శులు నర్సింహులు, సాయినాథ్, సోము, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ బకాయిలు, కనీస వేతనాలు అమలు చేయాలి

నవతెలంగాణ -ఆర్మూర్


నినాదాలు చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులకు 8 నెలల పీఆర్సీ బకాయిలు కనీస వేతనాలు అమలు చేయకపోతే సమ్మె నోటీసు ఇస్తాం అని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దండి వెంకట్ అన్నారు. మున్సిపల్ ఏర్పడిన నుండి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో ఆర్మూర్ మున్సిపల్ అధికారులు తీవ్రమైన వివక్ష చూపుతున్నారని విమర్శించారు. పట్టణంలోని నర్సింహ్మ స్వామి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం ప్రకటించిన పీఆర్సీ 8 నెలల బకాయిలు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఏడుమందికి ఒక గ్రూప్ ఏర్పాటు చేయడం మూలంగా కార్మికులకు నెలనెలా వేతనాలు రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. 220 మంది కార్మికులను రెండు గ్రూపులుగా ఏర్పాటుచేసి నెలనెలా వేతనాలు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(బీఎల్‌టీయూ) నూతన కమిటి ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా - బ్యాగరి అశోక్, ప్రధాన కార్యదర్శిగా - రాజేశ్వర్, సహాయ కార్యదర్శిగా చిన్ను బాయి, ఉపాధ్యక్షులుగా - పాండు, బి. రామన్నతో పాటు తొమ్మిదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

## ఓటర్ నమోదుకు విశేష స్పందన


ఓటర్లను నమోదు చేసుకుంటున్న బీఎల్‌ఓలు

నవతెలంగాణ-ఎడపల్లి

18 సంవత్సరాల నిండిన యువతి యువకులు కొత్తగా ఓటర్ నమోదు కోసం సంబంధిత గ్రామాల బూత్ లెవెల్ స్థాయి అధికారులకు దరఖాస్తులను చేసుకుంటున్నారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో (బిఎల్వోలు) రెండు రోజుల నుండి అందుబాటులో ఉంటూ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తహసిల్దార్ మోతి సింగ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్‌తో పాటు సంబంధిత అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తూ నమోదు అయినటువంటి ఓటర్ లిస్టు జాబితాలను అధికారులు పరిశీలించారు. మంగళ్ పహాడ్, జానకంపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు బిఎల్వోలతో సమావేశం ఏర్పాటు చేస్తూ ఓటర్ నమోదులో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని బిఎల్ఓ లను సూచిస్తున్నారు. ఆదివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల లో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కార్యక్రమానికి 18 సంవత్సరాల నుండి యువతి యువకులు భారీ పెద్ద మొత్తంలో దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలోని మంగళ్ పహాడ్ లో బూత్ లెవెల్ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి ,(బిఎల్ వో లు),,రామిరెడ్డి, (అంగన్వాడి ఉపాధ్యాయురాలు,)బండ కళ్యాణి, జానకంపేటలో గ్రామపంచాయతీ కార్యదర్శి, బూత్ లెవెల్ స్థాయి అధికారి ప్రేమ్ దాస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రాణాలు నిలపడంలో బ్లెడ్ బ్యాంక్‌లది కీలకపాత్ర పాత్ర

- జీవన్ ధార వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్


బ్లడ్ బ్యాంక్ ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రక్త దానం చేయండి.. ప్రాణ దాతలు కావాలని, ఆపదలు ఎప్పుడు చెప్పి రావు.. యువత రక్త దానం చేయడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. ప్రాణాలు నిలపడం లో బ్లడ్ బ్యాంక్‌లని కీలకపాత్ర పాత్ర అని అన్నారు. నిజామాబాద్ నగరంలో ముదిరాజ్ గల్లీ లో జీవన్ ధార వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ని ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. ఎంత దానం చేసిన తరగని ఆస్తి రక్తం. కులా మతాలు వేరైనా మనుషుల్లో ప్రవహించేది ఒకే రక్తం అని అన్నారు. ప్రాణాలు నిలబెడుతున్న రక్త నిధి కేంద్రాలకు సహకారం అందించాలని, యువత రక్త దానం చేయడానికి ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో సిర్ప రాజు, కొండపాక రాజేష్,ఎర్రం గంగాధర్,బొబ్బిలి మురళి,తడ్కల్ శ్రీను నిర్వాహకులు పాల్గొన్నారు.

# తప్పిన పదం.. మారిన అర్థం

- ఆర్టీసీ బస్సులో పదం మారిన వాక్యం

నవతెలంగాణ-బోధన్



సరిపదా పక్కన లేని చిల్లర అనే పదం

ఆర్టీసీ బస్సులో రాసే వాక్యాలు ప్రయాణికులకు సూచనలు ఇస్తు ఉన్న కొన్నిసార్లు ఆ వాక్యంలోని పదాలు తప్పిపోవుట వాటి అర్థమే మారిపోయే పరిస్థితి ఉంటుంది. దానికి నిదర్శనమే బోధన్ డిపో ఆర్టీసీ బస్సులో రాసిన ఈ వాక్యం. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో "టిక్కెట్టుకు సరిపడా చిల్లర ఇచ్చి కండక్టర్ కు సహకరించగలరు" అని వాక్యం రాసిన అందులో "చిల్లర" అనే పదం లేకపోవడంతో వాక్యం తారుమరైంది. దాంతో ప్రయాణికులు దీనిని చదువుతూ నవ్వుకుంటున్నారు. ఆర్టీసీ సిబ్బంది ఈ తప్పిదాన్ని గుర్తించి తక్షణమే సరి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన కాలనీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తిరుమల కాలనీ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు ఆదివారం వేల్పూర్ మండలానికి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాగార్జునను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దాల్సింది ఉపాధ్యాయులే

• సిఎస్ఐ చర్చిలో ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ద వలసింది ఉపాధ్యాయులేనని పాస్టర్ శశి ప్రకాష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోనిపాస్టరేట్లో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరినీపూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆరాధనలో భాగంగా టీచర్ల బాధ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సిఎస్ఐ చర్చి సంఘ సభ్యులు, మహిళలు, యువతులు, యువకులు, వృద్ధులు పాల్గొన్నారు.


చర్చిలో ఉపాధ్యాయులను సన్మానించిన ఫాస్టర్, చర్చి సంఘ సభ్యులు

## వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి కు చెందిన ముక్క రాధాకిషన్ గుప్తా మనువరాలి వివాహానికి జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఆదివారం హాజరయ్యారు. మాక్లూర్ మండలంలోని గుత్ప శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన వివాహంలో నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్ రెడ్డి , పట్టణానికి చెందిన నాయకులు కంచెట్టి గంగాధర్ నూతల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెళ్లిలో పాల్గొన్న ఎంపీ

# హస్తంలో అదృష్టం ఎవరికో


• టికెట్ కోసం నేతల మధ్య పోటీ
• పోటాపోటీగా కార్యక్రమాలు
• రేవంత్‌రెడ్డిని నమ్ముకున్న సుభాష్ రెడ్డి
• రాహుల్ గాంధీతో మదన్మోహన్
• అనుచరులు అయోమయం

నవతెలంగాణ-లింగంపేట్

త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి అసెంబ్లీ నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్టు ఎవరికి వరిస్తుందో ఉత్కంఠ నెలకొంది. ఎవరికి వారే పోటాపోటీగా కార్యక్రమాలు విస్తృత పర్యటనలు పరామర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం ఇద్దరు నేతలు తీవ్ర పోటీపడుతున్నారు. దీంతో అనుచర వర్గాల్లో మాత్రం అయోమయం నెలకొంది.రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే ఆశావహుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిశీలిస్తుంది. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ఇద్దరు బలమైన అభ్యర్థులు ఆశించడంతో ఈ స్థానంపై ఆసక్తి నెలకొంది. టికెట్ ఎవరికీ వస్తదా అన్న ప్రచారం జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఎవరికి వారే టికెట్ ఖచ్చితంగా వస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ బలమైన ఓటు బ్యాంకు ఉన్నప్పటికిని రెండు వర్గాలుగా చీలిపోయింది. దీంతో ఎవరికి వారే పోటీపడి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గతంలో జహీరాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గట్టి పోటీనిచ్చిన మదన్మోహన్‌రావు ఈ సారి ఎల్లారెడ్డి నియోజకవర్గ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరో నేత వడ్డెపల్లి సుభాష్ రెడ్డి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇద్దరు నేతలు చాలా రోజుల నుండి

నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల నుండి గిరిజన తండాల వరకు పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డేపల్లి సుభాష్ రెడ్డి టికెట్ ఆశించగా ప్రస్తుత శాసనసభ్యులు జాజాల సురేందర్‌కు కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కింది. మదన్

మోహన్ రావుకు 2019 ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన జాజాల సురేందర్ పార్లమెంట్ ఎన్నికల ముందే గులాబీ కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఊహించని దెబ్బ తగిలింది. సురేంద్ర వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు బిఆర్ఎస్‌లో చేరారు. అప్పటినుండి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి టికెట్ ఆశించిన సుభాష్ రెడ్డి మరోవైపు పార్లమెంట్ ఎన్నికల్లో స్వల్ప ఓట్లతో ఓడిపోయిన మదన్మోహన్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడి పార్టీ బలోపేతం కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానము ఎప్పటికప్పుడు ఎండగడుతో గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటమికి కారణమైన ఎమ్మెల్యే సురేందర్ పై మదన్మోహన్ సైతం ప్రతికారం తీర్చుకోవడానికి కసితో ఉన్నారు. దీంతో మదన్ మోహన్ రావు మండల కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు నియోజకవర్గ స్థాయిలో కార్పొరేట్ స్థాయిలో కార్యాలయం ఏర్పాటు చేసి చేసుకొని కార్యక్రమాల కొనసాగిస్తున్నారు. అదేవిధంగా గతంలో టికెట్ ఆశించిన వడ్డిపల్లి సుభాష్ రెడ్డి సైతం సేవా కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇద్దరు నేతలు కాంగ్రెస్ అధిష్టానం పిలుపుమేరకు ఏ కార్యక్రమాలైనా పోటాపోటీగా చేపడుతున్నారు. దీంతో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఇరువురు అనుచరులు వేరువేరుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇద్దరు నేతలు ఎల్లారెడ్డి పట్టణంలో కార్పొరేట్ తరహాలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అలాగే ప్రతి మండల కేంద్రంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎవరికి వారి సోషల్ మీడియా ఏర్పాటు చేసుకొని ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోని అప్పుడప్పుడు ఇరువర్గాల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు డిసిసికి పీసిసికి ఫిర్యాదు చేసుకున్నారు.


వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి
మదన్‌మోహన్‌రావు

**రాహుల్‌తో సన్నిహిత సంబంధాలు**

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీతో మదన్ మోహన్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సమాచారం. రాహుల్ గాంధీ అమెరికా పర్యటన మదన్ మోహన్ పర్యవేక్షణ కొనసాగింది. రాష్ట్ర పార్టీ నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి బట్టి విక్రమార్క ఫోటో రాష్ట్ర స్థాయి నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎవరి బలం ఎంత ఉందో సర్వేలో తేలనుంది. కాంగ్రెస్ పార్టీ గెలుపు గుర్రాల కోసం సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తుందని తనకే టికెట్ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**పిసిసి అధ్యక్షుని అండతో**

వడ్డేపల్లి సుభాష్ రెడ్డి మొదటి నుంచి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నమ్ముకున్నారు. రేవంత్ రెడ్డి నిర్వహించిన జూడో యాత్రలో సందర్భంగా ఎల్లారెడ్డి టికెట్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ నిర్ణయిస్తారని గతంలో రేవంత్ రెడ్డి ప్రకటించారు. రేవంత్ రెడ్డితో సన్నిహితుడిగా పేరున్న సుభాష్ రెడ్డి తమకే టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు

**అనుచరులు అయోమయం**

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఇద్దరు నేతలు టికెట్ కోసం పోటీ పడడంతో ఇద్దరు నేతల కార్యకర్తలు అనుచరులు అయోమయంలో ఉన్నారు. తమ నాయకుడికే టికెట్ వస్తుందని అనుచరులు ప్రచారం చేసుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ కాంగ్రెస్ అధిష్టానం ఏం చేస్తుందో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధిష్టానం ఎవరి పేరు ప్రకటిస్తుందో అనుచర వర్గాల్లో అయోమయం నెలకొంది.

## సెంటర్‌లో 'బెల్ట్ షాప్'

• మందుబాబుల చేష్టలకు భయాందోళనలో ప్రజలు

నవతెలంగాణ-వర్ని(చందూర్ )

మండల కేంద్రంలో మద్యం బెల్ట్ షాప్ గ్రామ సెంటర్ లో కొనసాగటంతో మందు బాబులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చుట్టుపక్కల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నివాసాల పక్కనే బెల్ట్ షాప్ ఉండటంతో మందు బాబుల ద్వారా ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మద్యం సేవించి చౌరస్తా వద్ద మందు బాబు కునుకు

**గ్రామ కమిటీతోనే బెల్ట్ షాప్ వేలం**

గ్రామ పెద్దలు, కమిటీ ఆధ్వర్యంలోనే మద్యం బెల్ట్ షాప్ నిర్వహణకు కమిటీకి కొన్ని డబ్బులు చెల్లించి నడుపుకొనే విధంగా ఏర్పాటు చేశారు. దీనితో మందుబాబులకు అడ్డాగా మారింది. అటుగా వెళ్లే మహిళలకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. తాగిన మైకంలో దొంగతనం, అల్లర్లు కూడా జరుగుతుయని ప్రజల ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజా పతినిధులు పట్టించుకోకపోవటం లేదని అంటున్నారు. ఇలాంటి ప్రదేశంలో బెల్ట్ షాప్ లు కొనసాగించటం సరికాదని, కొన్ని సందర్భాల్లో అధికారుల వాహనాలకు అడ్డుగా పడుకున్నా సంఘటనలు ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. తాగిన మత్తులో షాపుల ముందర, ఇండ్ల ముందర నిద్ర పోతున్నారని, వారిని చూచి మహిళలు చిన్న పిల్లలు అటుగా వెళ్లే విద్యార్థులు భయందోళన చెందుతున్నారని అంటున్నారు. గ్రామ నడి సెంటలో ఉన్న బెల్ట్ షాప్ ను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అధ్యాపకులు బాధ్యతతో పని చేయాలి

• ఇంటర్ విద్యాధికారి రఘురాజ్


నూతన అధ్యక్షున్ని సన్మానిస్తున్న అధ్యాపకులు

నవతెలంగాణ-ధర్పల్లి

ఇదివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ కావడంతో వారి బాధ్యత పెరిగిందని, వారి విధి నిర్వహణలో మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ రఘురాజ్ అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలలో, తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ నంబర్ 359 జిల్లా స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర కమిటీ అధ్యక్షులు, గాదే వెంకన్న కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ అధ్యాపకులు నిబద్ధతతో పనిచేస్తూ, ప్రభుత్వ కళాశాలను మరింత పటిష్టవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల అభ్యున్నతికి కాంట్రాక్టు అధ్యాపకులు ఎంతో కృషి చేశారని అన్నారు. వారు రెగ్యులరైజ్ కావడం హర్షనీయమని అన్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షులు వెంకన్న మాట్లాడుతూ తమ ఆర్.జే.డి. యూనియన్ ఆధ్వర్యంలో ప్రతి అధ్యాపకునికి న్యాయం జరిగేలా కృషి చేయడం జరిగిందని అన్నారు. మిగిలిపోయిన ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ధర్పల్లి కళాశాల ప్రిన్సిపల్ రజిఒద్దీన్ అస్లాం, కామారెడ్డి ప్రిన్సిపల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనాథ్ మాట్లాడుతూ .. జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా కమిటి అధ్యక్షులుగా ధర్పల్లి కళాశాలకు చెందిన మామిడి విట్టల్, ఉపాధ్యక్షులుగా కోటగిరి కళాశాలకు చెందిన డాక్టర్ రాము, ఎన్.జాన్, ప్రధాన కార్యదర్శిగా జి .శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గంగాధర్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా సాయికుమార్, కోశాధికారిగా పి. సంతోష్, సంయుక్త కార్యదర్శిగా ముత్తన్న, కార్యవర్గ సభ్యులుగా సాయికుమార్ సతీష్ కుమార్ , వెంకటేష్, బాలు, సాంకేతిక సలహాదారుగా బి. ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు, అనంతరం నూతన ఎన్నికైన అధ్యక్షునికి ఘనంగా సన్మానించారు .కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం నర్సింలు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న స్వచ్ఛ కాలనీ


చెత్తను తొలగిస్తున్న కాలనీ వాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆదివారం తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా 14వ వారం కాలనీ వాసులు కాలనిలోని భక్త హనుమాన్ ఆలయ పరిసరాల్లో శ్రమదానం చేశారు. ఆలయం పరిసరాల్లోని పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు, చెత్త చెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుపాల శివరాజ్ కుమార్, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు సుంకే శ్రీనివాస్, కొక్కెర భూమన్న, సంయుక్త కార్యదర్శి కొంతం రాజు, బొల్లు జీవన్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబీకుల ఓట్లు
# ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు సంబంధిత ప్రాంతంలోని ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు-చేర్పులకు వీలుగా పోలింగ్ బూత్ ల పరిధిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ పోలింగ్ బూత్ లను ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్, బాల్కొండలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక శిబిరాల నిర్వహణ తీరుతెన్నులు పరిశీలించారు. ఓటర్ల నమోదు, జాబితా నుండి పేర్ల తొలగింపు, మార్పులు-చేర్పుల కోసం పాటిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకుని, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ఓటరు జాబితాలోని ప్రతి ఓటరు వివరాలను ఇంటింటికి తిరుగుతూ క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని బీ.ఎల్.ఓ లను ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తిస్తూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లకు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు గుర్తిస్తే, వారందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోకి చేర్చాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక శిబిరాలు నిర్వహించిన సందర్భంగా ఓటరు నమోదు, మార్పులు-చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను ఏ ఒక్కటి కూడా తప్పిపోకుండా వెంటదివెంట బీ.ఎల్.ఓ యాప్ ద్వారా వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఓటరు తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

## నిర్ణీత సమయానికి ముందే పోలింగ్ స్టేషన్‌కు తాళం

• నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలు బీఎల్ఓలు



తాళంవేసి ఉన్న పోలింగ్‌కేంద్రం

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ బాలుర మరియు బాలికల పాఠశాల పోలింగ్ స్టేషన్లకు మధ్యాహ్నం 1.55కే తాళం వేశారని బోధన్ బిజెపి రాష్ట్ర నాయకుడు అడ్లూరి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. బూత్ లెవల్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఓటరు నమోదు ఇతర వివరాలు తెలియజేయ లేదని అన్నారు. ఇకనైనా పైఅధికారులు స్పందించి ఓటర్ నమోదు ప్రక్రియ మార్పులు చేర్పులు చేయాలని తెలిపారు.

## విద్యుత్ షాక్ తగిలి ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని శివతాండ గ్రామంలో మండల కేంద్రానికి చెందిన రమేష్ అనే వ్యక్తికి విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కేబుల్ వైర్ పెట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్ బుడ్డి అమర్చి ఉన్న స్తంభంపైకి ఎక్కాడు. త్రీ ఫేస్ కరెంట్ షాక్ తగలడంతో క్రింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



## పిట్లం మార్కెట్ యార్డులో దుకాణాల
# అద్దెకు ఆన్‌లైన్‌లో వేలం

• 11లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన

నవతెలంగాణ-పిట్లం

పిట్లం వ్యవసాయ మార్కెట్ యార్డు నందు నూతనంగా నిర్మించిన 20 దుకాణ సముదాయాలను అద్దె ప్రాతిపదికన ఆన్ లైన్ ద్వారా బహిరంగ వేలం నిర్వహించనున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందులో ఎస్సిలకు 3, ఎస్టీకి ఒకటి, బి.సి కి 5, పిహెచ్‌సికి ఒక దుకాణం, జనరల్ క్యాటగిరి క్రింద ఇతరులకు 10 దుకాణాలు కేటాయించినట్టు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల అభ్యర్థులు పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయపు పనివేళలలో 500 రూపాయలు చెల్లించి దరఖాస్తు పొందాలని సూచించారు. దరఖాస్తు వెంట కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పిట్లం పేర 15,000 రూపాయల డి.డి. ని ఏదైనా జాతీయ బ్యాంక్ నుండి తీసి, స్వంత చిరునామా గల ఏదేని ఆధార్/రేషన్/ఓటర్ కార్డును జతచేసి ఈ నెల 11 న సాయంత్రం 5 గంటలలోగా అదే కార్యాలయంలో అందజేయవలసినదిగా ఆమె సూచించారు. వివరాలకు కార్యదర్శి మొబైల్ నెంబర్ 7330733249 ను సంప్రదించవలసినదిగా ఆమె సూచించారు.

# ప్రజావ్యతిరేక విధానాలు ఎండగతాం

• కాంగ్రెస్ పార్టీ సాలూర మండల అధ్యక్షులుగా మంధర్న రవి ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా హూన్స సొసైటీ చైర్మెన్ మంధర్న రవిని ఆదివారం సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా సాలురా గ్రామానికి చెందిన బీహారి హన్మంత్ రావు పటేల్ ని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి పార్టీ పరిశీలకులుగా హాజరయిన బోధన్ నియోజకవర్గం పీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రజా మ్యానిఫెస్టోని ప్రజలకు వివరించాలని, అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల పాలనను ప్రజలలో ఎండగట్టాలని సూచించారు. అలాగే బోధన్ మండల నూతన అధ్యక్షులుగా నాగేశ్వర్ రావును ఎన్నుకున్నారు. అనంతరం కొత్తగా నియమితులైన బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వరరావును, నూతన సాలూరా మండల అధ్యక్షులుగా మంధర్నా రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హన్మంతరావు పటేల్‌కు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హంధన్, ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, అల్లే రమేష్, రవీందర్ రెడ్డి ,యువజన కాంగ్రెస్ బోధన్ మండల అధ్యక్షులు ఖాజాపూర్ అశోక్, ఇత్తేపు రమేష్, తగ్గెల్లి దేవరావు, బుద్దె లక్ష్మణ్, రావుల లక్ష్మణ్, ఛిద్రపు రాములు, సాలురా మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రవికి నియామక పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

## పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత


ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన లింబాద్రి అనే వ్యక్తి తన మొబైల్ ఫోను పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై హరిబాబు సి ఈఐఆర్ సాంకేతికత ద్వారా పోగొట్టుకున్న ఫోన్ ఆచూకీ కనుగొని బాధితుడు లింబాద్రికి అందజేశారు ఈ సందర్భంగా లింబాద్రి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ వాడే మొబైల్ యొక్క పూర్తి సమాచారాన్ని కలిగి ఉన్నప్పుడు సిఈఐఆర్ ద్వారా అదె ఎక్కడుందో కనుగొనవచ్చు ఎస్ఐ తెలిపారు.